క్లుప్తంగా

ఉప్పొంగిన గంగమ్మ

- రైతు పొలంలో ఐదు ఇంచుల నీళ్లు



బోరులో నుంచి ఉబికి వస్తున్న నీరు

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లికి చెందిన రైతు వెంకటరమణప్ప వ్యవసాయ భూమిలో బుధవారం బోరు వేయగా 5 ఇంచుల నీళ్లు పడ్డాయి. తనకున్న మూడెకరాల పొలంలో గతంలో ఎన్నిబోర్లు వేసినా నీళ్లు పడకపోవడంతో ఆయన కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లాడు. మళ్లీ వ్యవసాయం చేసుకోవాలన్న ఆసక్తితో తాజాగా బోరును తవ్వించగా 5 ఇంచుల నీళ్లు పడటంతో వెంకటరమణప్ప ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి.

మంచం పట్టిన 'మణూరు తండా'



జ్వరాలతో బాధపడుతూ మంచానికి పరిమితమైన తండా వాసులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు తండాలో విషజ్వరాలు ప్రబలాయి. తండాలో అపరిశుభ్రత, దోమలు వ్యాపించడంతో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు బుధవారం జనార్దన్‌నాయక్, కవిత, సాకమ్మ, భారతి తెలిపారు. పలువురు చిన్నారులకు జ్వరం సోకడంతో పాఠశాలకు కూడా వెళ్లడం లేదన్నారు. వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వరంతో బాధపడుతున్నవారికి చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మురికి కాలువలను శుభ్రం చేసి దోమలను నివారించాలన్నారు.

లఘు చిత్రాల ద్వారా అవగాహన

రొద్దం: బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదవనిద్దామని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని లఘు చిత్రాల ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని చోళేమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ, జిల్లా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి అనర్థాలపై ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో లఘుచిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న దృశ్యం

హిందూపురం టౌన్: మండల పరిధిలోని గోళ్లాపురంలో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున మొక్కలను నాటి వాటికి ఇనుప జాలీలను ఏర్పాటు చేశారు. సూర్యరోషిణి లిమిటెడ్ సీఈఓ మాణిక్ పాటిల్ మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు కాపాడుకోవడం మనందరి బాధ్యతన్నారు. గోళ్లాపురం సర్పంచ్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెబాట పట్టిన క్లాప్ కార్మికులు



చెత్త సేకరణ వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు

హిందూపురం టౌన్: పట్టణంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే క్లాప్ డ్రైవర్లు సమ్మె బాట పట్టారు. బుధవారం పట్టణంలో చెత్త సేకరించే వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. విధులను బహిష్కరించి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. క్లాప్ ఆటో డ్రైవర్లు నరసింహులు, అనీల్ కుమార్‌లు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మున్సిపల్ కమిషనర్ పెండింగ్ వేతనాలతో పాటు ప్రతి నెల వేతనాలను అందిస్తామని చెప్పి మాటతప్పారన్నారు. బకాయి వేతనాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకూ చెత్తను సేకరించబోమన్నారు.

కరుణించని వరుణుడు

- ఎండిపోతున్న పంటలు
- హిందూపురం డివిజన్‌లో కళతప్పిన మొక్కజొన్న, కంది
- లబోదిబోమంటున్న రైతులు



చిలమత్తూరు చెరువు కింద నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

హిందూపురం అర్బన్: రాష్ట్రంలో ఓ వైపు అతివృష్టి.. మరోవైపు అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు వరదలతో పంటలు కొట్టుకుపోవడంతో రైతులు బతుకు దేవుడా అంటూ విలపిస్తుండగా.. శ్రీసత్యసాయి జిల్లాలో 20 రోజులుగా పూర్తిస్థాయిలో వర్షం కురవకపోవడంతో మొక్కజొన్న, వేరుశనగ పంటలతో పాటు కంది, పెసర, అనప, రాగి పంటలు ఎండుముఖం పట్టాయి. మరో రెండు రోజుల్లో వర్షం కురవకపోతే సగానికి సగం దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. వరుణుడు కరుణించకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రధానంగా హిందూపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మొక్కజొన్న పంట పక్క ఎన్నులు రావడం, కొన్ని చోట్ల ఎంకులు పాలు పట్టే సమయంలో వర్షం లేక పోవడంతో పంట దెబ్బతింది. దీంతో పంటలు నిలువునా ఎండుతున్నాయి. ఇక కంది పూత వచ్చే సమయంలో వర్షం రాక పోవడంతో పంట వాడుతోంది. హిందూపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, గోరంట్ల మండలాల్లో 56,108 ఎకరాల్లో 23,180 మంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో గోరంట్ల మండలంలో 24,540 ఎకరాల్లో 5,906 మంది , చిలమత్తూరు మండలంలో 10,355 ఎకరాల్లో 4,723 మంది రైతులు, పరిగి మండలంలో 7,088 ఎకరాల్లో 4,047 మంది, హిందూపురం మండలంలో 7,500 ఎకరాల్లో 4,879 మంది, లేపాక్షి మండలంలో 6,625 ఎకరాల్లో 3,625 మంది పంటలు సాగు చేశారు. అందులో 80 శాతం పంటలో 45,000 ఎకరాలకు పైగా మొక్కజొన్న, కంది, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. వారం రోజుల్లో వర్షం వస్తే 30 శాతం పంట చేతికొస్తుందని లేకుంటే అది కూడా దక్కదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో సాగులో ఉన్న వ్యవసాయ భూమి	3,93,252 ఎకరాలు
పంట సాగు చేసిన రైతుల సంఖ్య	1,35,895 మంది
ఇప్పటి దాకా క్రాప్ బుకింగ్ చేసింది	2,85,825 ఎకరాలు
ఎండిన పంటలు	1,64,892 ఎకరాలు

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం



వర్షమే ఆధారంగా రెండు ఎకరాల్లో మొక్కజొన్న , మిర్చి పంట సాగు చేశా. మంచి సమయంలో వర్షం రాకపోవడంతో పంట ఎండుతోంది. వర్షం వస్తే తప్ప పంట చేతికి దక్కే అవకాశం లేదు. పంట తీసేసి వేరే పంట సాగు చేసేదానికి కూడా వర్షం పడాల్సిందే. ఇలాంటి దారుణం ఐదేళ్ల తరువాత చూస్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, మరువకొత్తపల్లి

వర్షం పడితేనే దిగుబడి



ఇప్పటి వరకు పంటలు బాగున్నా.. వారం రోజుల్లోనే పలు మండలాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. పంట పక్వ దశలో ఉన్న సమయంలో ఇలా ఎండుతోంది. ఇప్పుడు వర్షం వచ్చినా పంట చేతికందుతుంది. నాలుగైదు రోజుల్లో వర్షాలు వస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. వర్షం వస్తే పంట చేతికి దక్కుతుంది.

– అల్తాఫ్ అలీఖాన్, వ్యవసాయ సహాయ సంచాలకులు, హిందూపురం

విచారణ వేగవంతం చేయాలి

పెనుకొండ: అత్యాచార కేసుల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు విచారణను వేగవంతం చేసి నిందితులకు వెంటనే శిక్ష పడేలా చేయాలని సమతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. నిందితులకు శిక్ష పడేలా చేస్తేనే దేశంలో అత్యాచార ఘటనలు తగ్గుతాయన్నారు. మరో వెయ్యి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: విద్యార్థులు పరిశుభ్రతను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 'స్వచ్ఛతా పఖ్వాడా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌ను అరెస్టు చేయండి

రొద్దం: మండల పరిధిలోని కంచిసముద్రం సమీపంలో రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 7న ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో బోల్తా పడిందన్నారు. ప్రమాదంలో ఆర్ లోచెర్లకు చెందిన కురుబ శ్రీరాములకు రెండు కాళ్లు విరిగాయన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్నాడని, పరారీలో ఉన్న ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేయాలని కోరారు.

తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ మార్కండేయులు

హిందూపురం అర్బన్: అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక హెడ్ పోస్ట్ మాస్టర్ మార్కండేయులు కోరారు. బుధవారం అదనపు జిల్లా కోర్టు ఆవరణంలో తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలపై అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బందికి అవగాహన కల్పించారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ మాట్లాడుతూ ఏడాదికి రూ.549 ప్రీమియం చెల్లించి రూ.10 లక్షలు బీమా సౌకర్యం , రూ.749 ప్రీమియం చెల్లించి రూ.15 లక్షల వరకూ బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. పీఎంఎస్‌బీవై పథకం కింద రూ.20 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షలు వరకూ బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లతో మోసపోకుండా తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సిద్దూ, గోపాల కృష్ణ, సత్యనారాయణ, కళావతి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

హిందూపురం: టీడీపీ నాయకుల దాడులు సహించబోమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని కొల్లకుంట శివశంకర్‌రెడ్డి కుటుంబానికి భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను మధుమతిరెడ్డి హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పరామర్శించారు. కూటమి నాయకుల దౌర్జన్యాలు, దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వాస్తవ పరిస్థితులను ఎస్పీకి వివరించి బాధితులకు న్యాయం జరిగేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, నాయకులు సుధాకర్‌రెడ్డి, రంగనాథ్, తిమ్మిరెడ్డి ,నారాయణరెడ్డి, ఓబుల్ రెడ్డి, అజయ్, చంద్రరెడ్డి, అనిల్ రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి' పోస్టర్ల విడుదల

మడకశిర: పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట బుధవారం ఈఏడాది చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎంఈఓ భాస్కర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ విడుదల చేశారు. ఈనెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబర్ 9,10 వతేదీల్లో రాష్ట్రస్థాయిలో చెకుముకి సంబరాలు జరుగుతాయన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

చిలమత్తూరు: మండల పరిదిలోని వీరాపురం, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాలకు నేటి నుంచి వ్యవసాయ వినియోగానికి ప్రస్తుతం ఇస్తున్న విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి 11 వరకూ వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

పురంలో గణేష్ నిమజ్జనం రేపు

- వాహనాల దారి మళ్లింపు
- 1200 మందితో పోలీసు బందోబస్తు



వినాయక నిమజ్జనం జరిగే గుడ్డం రంగనాథ స్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరు

హిందూపురం అర్బన్: పట్టణంలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఇందులో భాగంగానే శోభాయాత్ర రూట్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. బీఎస్‌టీ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్, పరిగి రోడ్డు, ఎంఎఫ్ రోడ్డు, బైపాస్ రోడ్డు, మెయిన్‌బజార్, రైల్వే రోడ్డు, బాలాజీ సర్కిల్, రహమత్‌పూర్ సర్కిల్ , ఎంజీఎం స్కూల్ రోడ్డు మీదుగా గుడ్డం రంగనాథస్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరు వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలు, కార్లకు పట్టణంలోకి అనుమతి లేదన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో (చిన్న సందుల్లో) పట్టణంలోకి వెళ్లాలన్నారు. 1200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ బస్టాండ్ వరకూ మాత్రమే వస్తాయి. పట్టణంలోనికి అనుమతించరు.
- గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలు (ఆర్టీసీ మినహా) ఇతర వాహనాలను కొట్నూరు క్రాస్ వరకూ మాత్రమే అనుమతిస్తారు. అక్కడి నుంచి అనంతపురం, పెనుకొండ, మడకశిర వైపునకు దగ్గరలో ఉన్న శిరా హైవే మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- లేపాక్షి వైపు నుంచి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సులు చోళసముద్రం క్రాస్ నుంచి హైవే మీదుగా కొట్నూరు మీదుగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వరకూ వస్తాయి. చోళసముద్రం రహదారిలోకి అనుమతించరు.
- బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలు కిరికెర క్రాస్ నుంచి బైపాస్ మీదుగా ఆటోనగర్ క్రాస్ , రహమత్‌పూర్ సర్కిల్, అండర్ బ్రిడ్జి, శ్రీకంఠపురం సర్కిల్, పూలకుంట, చోళసముద్రం మీదుగా హైవేకి చేరుకుంటాయి.
- మడకశిర వైపు నుంచి వచ్చే వాహనాలు సేవామందిర్ వరకూ మాత్రమే అనుమతిస్తారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఏఏ గ్రామాల్లో ఏఏ పనులు చేస్తున్నారు, కూలీలు ఎంత మంది హాజరవుతున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, జేఈ జగదీష్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరాపురం: ప్రస్తుతం వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోహర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎయిడ్స్ నివారణపై అవగాహన

మడకశిర: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఎయిడ్స్ నివారణపై ఫోర్డ్ సంస్థ ప్రతినిధులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది? ఎలా వ్యాప్తి చెందుతుంది? నివారణ చర్యలు తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ, సంస్థ సిబ్బంది లలిత, నాగేశ్వరి, హెచ్ఎం శకుంతల, ఉపాధ్యాయురాలు రామాంజినమ్మ, పీఈటీ అనిత తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

సోమందేపల్లి: మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌లో దోమల నివారణపై వైద్య సిబ్బంది బుధవారం స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రైనేజీ కాలువలు వద్ద మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఎం.ఎల్.హెచ్‌పీఎస్ శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గుడిబండ: మండల పరిధిలోని ఎమ్ఎస్ తండా శివార్లలో పది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 21,000 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నేడు క్రికెట్ టోర్నీ ప్రారంభం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తాలుకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ శ్రీరామరెడ్డి 119వ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 68 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు.

విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మంజునాథ తెలిపారు. 80 శాతం సబ్సిడీతో 10 కేజీల ఉలవలను రూ.174తో అందజేస్తున్నామన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

గుడిబండ: ఖరీఫ్ సీజన్‌కు సంబధించి పంటకోత ప్రయోగాలను కచ్చితంగా నిర్వహించాలని డీవైఎస్ఓ మల్లికార్జున పేర్కొన్నారు. మండల కేంద్రలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో పంటకోత ప్రయోగాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రమణ, మండల వ్యవవసాయ అధికారి వీరనరేష్, ఎమ్‌పీఓలు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా పాలనాయక్

పావగడ: తాలూకాలోని నాగలమడక వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సేవా సహకార సంఘం) అధ్యక్షుడిగా పాలనాయక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పెద్దరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

గణపతి బప్పా మోరియా

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. ముందుగా ప్రత్యేక వాహనాల్లో గణేష్ ప్రతిమలను కొలువుదీర్చి డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గణపతి బప్పా మోరియా.. మంగళ మూర్తి మోరియా.. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అని నినదించారు. అనంతరం చెరువులు, కుంటల్లో గణపతి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు నిర్వహించారు.



హిందూపురం మండలం సడ్లపల్లిలో యువతుల కేరింత



పరిగిలో బొజ్జ గణపయ్యను నిమజ్జనోత్సవానికి తరలిస్తున్న దృశ్యం



పెనుకొండ పట్టణంలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు



రొళ్ల మండలం ఎం.రాయాపురంలో నిమజ్జనంలో యువకుల సందడి



హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



మడకశిర మండలం భీమరాయనపల్లిలో గణేశ్ నిమజ్జనం ఇలా..



భక్తుల కోలాహలం మధ్య లేపాక్షిలో సాగుతున్న శోభాయాత్ర



ముద్దిరెడ్డిపల్లిలో డ్యాన్స్ చేస్తున్న మహిళలు, యువతులు